సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



ఈ ఇల్లే వంద మందిని కాపాడింది.. - 8లో▸

ఆకేరు వాగు వరద ఉధృతికి సీతారాం తండాకు చెందిన వంద మంది నరేందర్ అనే వ్యక్తి భవనంపై తలదాచుకున్నారు.



శరవేగంగా రైల్వేట్రాక్ మరమ్మతు పనులు

భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం $30^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరుజల్లులు కురుస్తాయి. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

5న ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం : డీఈఓ

విద్యారణ్యపురి: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం 3గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి వేడుకలు నిర్వహించనున్నట్లు డీఈఓ వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల బాధ్యులు పాల్గొనాలని డీఈఓ కోరారు.

నిట్‌లో ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రాం



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో ఆన్‌లైన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నెల రోజుల ఫ్యాకల్టీ ఇండక్షన్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులకు న్యూ ఎడ్యుకేషన్ పాలసీకనుగుణంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు బోధనలో మెళకువలకు ఎఫ్ఐసీ తోడ్పడుతుందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, మాలవ్య మిషన్ టీచర్స్ ట్రైనింగ్ సెంటర్, నిట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన నెల రోజుల ఎఫ్ఐసీని అసిస్టెంట్ ప్రొఫెసర్లు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఐఆ చీఫ్ సైంటిస్ట్ సతీశ్‌కుమార్, నిట్ ప్రొఫెసర్లు టి.కిశోర్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

టీజీ ఐసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



రామన్నపేట: వరంగల్ ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం టీజీ ఐసెట్ కౌన్సెలింగ్ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులు స్లాట్ సమయానికి ఎంచుకున్న సెంటర్‌కు వెళ్లి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 4 నుంచి 11 వరకు tgicet.nic.inలో వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. 14న సీట్లు కేటాయిస్తారని, 14 నుంచి 17 వరకు ఆన్‌లైన్‌లో ప్రవేశరుసుము చెల్లించి సెల్ఫ్ రిపోర్ట్ చేయాలని చెప్పారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యే విద్యార్థులు అన్ని ఒరిజినల్, ఒకసెట్ జిరాక్స్‌ను తమ వెంట తీసుకురావాలని కోరారు. మొదటి రోజు 200 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైనట్లు ఆయన వివరించారు.

వేయిస్తంభాల దేవాలయం ఆదాయం రూ.5,68,870



హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల దేవాలయంలో మంగళవారం ఉదయం హుండీ లెక్కింపు నిర్వహించగా మొత్తం 80 రోజులకుగాను 5,68,870 రూపాయల ఆదాయం లభించిందని ఈఓ కె.వెంకటయ్య తెలిపారు. లెక్కింపులో దేవాదాయశాఖ డివిజనల్ పరిశీలకులు దేవాలయ ఇన్స్పెక్టర్ ఆర్.సంజీవరెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, సిబ్బంది, శ్రీలక్ష్మీవేంకటేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కాజీపేట, వరంగల్ మీదుగా వెళ్లే పలు రైళ్ల రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణించే 38 రైళ్లను ఇంటికన్నె–కేసముద్రం రైల్వే ట్రాక్ ఘటనతో రద్దు చేసినట్లు మంగళవారం రాత్రి రైల్వే అధికారులు తెలిపారు. అదేవిధంగా 32 రైళ్లను వేరే మార్గం గుండా దారి మళ్లించి నడపిస్తున్నట్లు పేర్కొన్నారు. రైళ్ల రద్దు, దారి మళ్లింపుతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కాజీపేట మీదుగా ప్రయాణించే పలు రైళ్లు రద్దు కావడంతో కాజీపేట జంక్షన్ నుంచి విశాఖపట్నం రూట్‌లో వెళ్లే వారు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకొని వెళ్లాల్సి వచ్చింది. విజయవాడ నుంచి కాజీపేట, వరంగల్‌కు రావాల్సిన వారు వయా నడికుడ మీదుగా కాజీపేట, వరంగల్‌కు చేరుకున్నారు.

తుది దశకు చేరిన 'కుడా' విస్తరణ ప్రతిపాదనలు

- 2,800 స్క్వేర్ కిలోమీటర్ల వైశాల్యం.. మరో వంద విలీన గ్రామాలు
- 280 గ్రామాలకు చేరనున్న కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధి
- 2051 మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా రూపకల్పన
- ముఖ్యమంత్రి పరిశీలన.. నేడో రేపు ఉత్తర్వులు జారీ



'కుడా' ప్రతిపాదిత మ్యాప్

మెప్పించి.. ఒప్పించేలా!

సాక్షి ప్రతినిధి, వరంగల్:

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధి విస్తరణ ప్రతిపాదనలు తుది దశకు చేరాయి. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వరంగల్ నూతన బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్–2051)తోపాటు 'కుడా' విస్తీర్ణం పెంపునకు వేగంగా పావులు కదులుతున్నాయి. 181 గ్రామాలను 280కు పెంచి, 1,805 స్క్వేర్ కిలోమీటర్ల నుంచి 2800 స్క్వేర్ కిలోమీటర్ల విస్తీర్ణం (వైశాల్యం)లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని విస్తరించనున్నారు. ఈ మేరకు కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ప్రజాప్రతినిధుల నుంచి ఆమోదపత్రాలను స్వీకరించిన సీఎం రేవంత్‌రెడ్డి.. మరో వంద గ్రామాలను విలీనం చేసే ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు కొత్తగా విలీనమయ్యే గ్రామాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయ సేకరణకు కలెక్టర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని 'కుడా' వర్గాలు తెలిపాయి.

భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని..

త్వరలోనే మాస్టర్‌ప్లాన్–2051ను అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని 'కుడా' విస్తీర్ణం పెంచుతున్నట్లు అధికారులు ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. గత ప్రభుత్వం విజన్–2041 పేరుతో జియో గ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) రూపొందించగా.. కొత్తగా గ్రోత్ కారిడార్ ప్రతిపాదించారు. ప్రాంతీయ, బాహ్య, అంతర్ వలయ రహదారుల పక్కన టౌన్‌షిప్‌లు ఏర్పాటు కానున్నాయి. 100, 150, 200 అడుగుల రహదారుల పరిసరాల్లో గ్రోత్ కారిడార్ నిబంధనలు అమల్లోకి వస్తాయి. కొత్తగా మిక్స్‌డ్ ల్యాండ్ యూజ్ జోన్‌ను ప్రతిపాదించారు. దీంతో 80, 100, 150, 200 అడుగుల రహదారుల పరిసరాల్లోని ఒక కిలోమీటరు వరకు మిక్స్‌డ్ ల్యాండ్ యూజ్ సిస్టమ్ అమలు చేస్తామని, ఫలితంగా నివాస, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా భవన నిర్మాణాలకు అనుమతులు వస్తాయన్నారు. హైదరాబాద్ హెచ్ఎండీఏ మాదిరిగా మూడు రహదారులు ప్రతిపాదించి, నగరంలో ఇన్నర్ రింగ్ రోడ్డుకు డిజైన్ చేశారు. అయితే, 2041 మాస్టర్‌ప్లాన్ అమల్లోకి రాకపోవడంతో గ్రోత్ కారిడార్ ప్రతిపాదనగానే మిగిలింది. వీటిని పరిగణనలోకి తీసుకుని భవిష్యత్‌లో వరంగల్ మెట్రో నగరంగా ఎదగడానికి అనుగుణంగా మాస్టర్‌ప్లాన్–2051 రూపొందిస్తున్నట్లు ప్రభుత్వం, పాలకవర్గం చెబుతోంది. ఇదే జరిగితే 10 జోన్లు, గ్రోత్ కారిడార్, మిక్స్‌డ్ ల్యాండ్ యూజ్ జోన్లతో దేశంలోని మెట్రో నగరాల సరసన వరంగల్ నిలువనుంది. ఈ క్రమంలో 'కుడా' పరిధిని 181 గ్రామాల నుంచి 280 గ్రామాలకు పెంచాలని ప్రతిపాదన చేసినట్లు చెబుతున్నారు.

గ్రామాల విలీనంపై అపోహలు వద్దు..



భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని 'కుడా' పరిధిలో సుమారు మరో వంద గ్రామాలను విలీనం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. త్వరలోనే మాస్టర్‌ప్లాన్–2051కి అనుగుణంగా 'కుడా' పరిధి కూడా 2800 స్క్వేర్ కిలోమీటర్లకు పెరుగుతుంది. స్పోర్ట్స్ సిటీ, హెల్త్‌సిటీ, ఫ్యూచర్ గ్రోత్ కారిడార్స్, పర్యాటక ప్రదేశాల ఏర్పాటవుతాయి. అందుకు అనుగుణంగా జరిగే అభివృద్ధితో వరంగల్ మెట్రో నగరాల జాబితాలో చేరుతుంది. 'కుడా'లో గ్రామాలు విలీనమైతే పన్నులు పెరుగుతాయన్న అపోహలు వద్దు. టీఎస్ బీపాస్ నిబంధనలే వర్తిస్తాయి.

– ఇనుగాల వెంకట్రాంరెడ్డి, 'కుడా' చైర్మన్

విలీన గ్రామాల జాబితాలో కొత్తగా..

'కుడా'లో కలిపేందుకు అధికారికంగా 33 గ్రామాలు అని అధికారులు చెబుతున్నారు. 33 రెవెన్యూ గ్రామాల పరిధిలోని తండాలు, శివారు గ్రామాలు వంద వరకు ఉంటాయని పాలకవర్గం అంటోంది. అవన్నీ కలిస్తే 'కుడా' పరిధిలో గ్రామాల సంఖ్య 280 వరకు చేరనుంది. కొత్తగా కలిసే ఈ జాబితాలో హుస్నాబాద్, పరకాల, శాయంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాలకు చెందిన గ్రామాలున్నాయి. భీమదేవరపల్లి, పరకాల, ఆత్మకూరు, దామెర, నడికూడ, శాయంపేట, వర్ధన్నపేట తదితర మండలాలకు చెందిన మల్లారం, కొత్తకొండ, ముస్తఫాపూర్, గట్ల నర్సింగాపూర్, వంగర, రత్నగిరి, కన్నారం, మాణిక్యాపూర్, భీమదేవరపల్లి, రాజిపేట, కామారెడ్డిపల్లి, మాదారం, వెల్లంపల్లి, పోచారం, మల్లక్ పేట, పరకాల, సర్వాపూర్, కంతాత్మకూరు, కొకొండ. ధర్మారం, రాయపర్తి, ముస్త్యాలపల్లి, నడికూడ ఉన్నాయి. పత్తిపాక, కొత్తగట్టుసింగారం, హుస్సేన్‌పల్లి, మైలారం, పెద్దకోడెపాక, తహరాపూర్, గట్లకానిపర్తి, నందనం, కక్కిరాలపల్లి గ్రామాల్లో అభిప్రాయ సేకరణకు అధికారులు ఆదేశాలు కూడా జారీ చేశారు.

బాధలు విని.. భరోసా ఇచ్చి..



మహబూబాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ప్రభుత్వ విప్ రాంచంద్రనాయక్, ఎంపీ బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మురళీనాయక్, యశస్విని రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు తదితరులు

వరద ముంపు బాధితులకు ధైర్యం చెప్పిన సీఎం

- మహబూబాబాద్ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో రేవంత్ పర్యటన
- ముంపు బాధితులతో మాట్లాడి అండగా ఉంటామని హామీ
- మూడు తండాలను కలిపి ఒకే ఆదర్శ కాలనీగా నిర్మాణం
- చెరువుల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం



మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం ఆకేరు బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఎంపీ, ఎమ్మెల్యేలు

సాక్షి, మహబూబాబాద్/ మహబూబాబాద్/ మరిపెడ/కురవి: 'మీ బాధలు విన్నాను.. అధైర్యపడకండి.. అండగా ఉంటాం..' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి.. వరద బాధితులకు భరోసా ఇచ్చారు. భారీ వర్షాలతో అతలాకుతలమైన మహబూబాబాద్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. ఖమ్మం నుంచి బయలు దేరిన సీఎం డోర్నకల్ మీదుగా మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెం సమీపంలోని ఆకేరు వాగు బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. అక్కడే అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ ప్రయాణిస్తున్న కారు ఆకేరు వాగు ప్రవాహానికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. ఆ ప్రాంతాన్ని, ఆకేరు వాగును, కల్వర్టు కొట్టుకుపోయిన తీరును ముఖ్యమంత్రి పరిశీలించారు. వాగు ప్రవాహ ఉధృతి ఎలా ఉంటుంది.. గతంలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకున్నాయా అని ముఖ్యమంత్రి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీసారి వాగు పొంగడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, రహదారి గతంలోనూ తెగిందని స్థానికుడు జర్పుల లక్ష్మణ్ ముఖ్యమంత్రికి తెలిపారు.

మోడల్‌కాలనీ ఏర్పాటు చేస్తా..

అక్కడినుంచి ఆకేరు వాగు పొంగి ముంపుబారిన పడిన సీతారాంతండాకు ముఖ్యమంత్రి చేరుకున్నారు. తండాలో ఇళ్లు మునిగిన వారిని ఓదార్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాము తీవ్రంగా నష్టపోయామని, ఆకేరు వాగు పొంగిన ప్రతీసారి తండాతోపాటు సమీపంలోని మరో రెండు తండాలకు నిద్ర ఉండడం లేదని, తమను రక్షించాలని తండావాసులు కోరారు. అనంతరం ముఖ్యమంత్రి వారినుద్దేశించి మాట్లాడారు. మూడు తండాలను కలిపి ఒకేచోట మోడల్ కాలనీ ఏర్పాటు చేస్తామని.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆకేరు వాగు పొంగి ఇళ్లలోని పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు, సర్టిఫికెట్స్ తడిసిపోయినందున ఒకే ఎఫ్ఐఆర్ దాఖలు చేసి అందరికీ కొత్తవి మంజూరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆకేరు ప్రవాహంపై శాస్త్రీయంగా అంచనా వేసి నూతన వంతెన నిర్మిస్తామని, నీటిని సమీపంలోని చెరువులు, కుంటలకు మళ్లించే ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామన్నారు. వరదలతో మహబూబాబాద్ జిల్లాలో నలుగురు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో ఖమ్మం జిల్లాకు చెందిన వారు ఇద్దరు, మహబూబాబాద్ జిల్లాకు చెందిన వారు ఇద్దరని తెలిపారు.

సుదీర్ఘ సమీక్ష

తండానుంచి నేరుగా జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌కు వచ్చిన సీఎం రేవంత్ భారీ వర్షాలతో జరిగిన నష్టం, దెబ్బతిన్న రైల్వేట్రాక్, రాళ్లవాగులో పడిన డీసీఎం, దెబ్బతిన్న రోడ్లు, జరిగిన ప్రాణనష్టంపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. విపత్తు సమయంలో సత్వరం స్పందించిన జిల్లా పోలీసు, రెవెన్యూ సిబ్బందిని అభినందించారు. విపత్తుల సమయంలో ఏం జరిగింది.. ఆ సమస్యను ఎలా అధిగమించారు... ఎలా సహాయక చర్యలు తీసుకున్నారనే దానిపై బ్లూబుక్ రూపొందించుకోవాలని కలెక్టర్‌కు ముఖ్యమంత్రి సూచించారు. జిల్లాలో ప్రభుత్వ చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని పరిరక్షించేందుకు హైడ్రా తరహాలో చర్యలు చేపడుతామని చెప్పారు. ఇందుకోసం కలెక్టర్, ఇతర శాఖల అధికారులతో నివేదిక తయారు చేసుకొని అక్రమణల తొలగింపునకు రంగంలోకి దిగాలని చెప్పారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వం కష్టపడినా ప్రాణనష్టం జరిగిందన్నారు. భారీ వర్షాల నేపథ్యంలోనూ ప్రతిపక్ష పార్టీ రాజకీయ లబ్ధి పొందాలని చూడడం సరికాదన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ అధికారులు మండల, గ్రామస్థాయిలో మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, రాంచంద్రనాయక్, యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, కోరం కనకయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కలెక్టర్ అద్వైత్‌కుమార్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అధికారులు పాల్గొన్నారు.

టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియ కొలిక్కి

- హనుమకొండ జిల్లాలో 104 మంది టీచర్లకు ఆర్డర్లు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియ ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ అనంతరం కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువమంది ఉండి టీచర్లు తక్కువగా ఉండగా, మరికొన్నిచోట్ల విద్యార్థులు తక్కువగా ఉండి టీచర్లు ఎక్కువగా ఉండడం లాంటివి చోటుచేసుకున్నాయి. ఏ మండలంలోని వారిని అదే మండల పరిధిలోని పాఠశాలల్లోనే టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేసుకోవాలని డీఈఓ సూచించటంతో ఆయా ఎంఈఓలు ఈ ప్రక్రియ చేపట్టినట్లు సమాచారం. జిల్లాలో అన్ని మండలాలు కలిపి 104మంది టీచర్లను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేశారని తెలుస్తోంది. ఈ మేరకు టీచర్లకు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసింది. ఉత్తర్వులు అందుకున్న వారిలో ఎంతమంది పాఠశాలల్లో చేరుతారో వేచి చూడాల్సింది. మరోవైపు పలు చోట్ల ఇంకా టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ అవసరం ఉండగా, అందుకు ఒక మండలం నుంచి మరో మండలానికి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కూడా చేయాల్సినవి ఉన్నట్లు గుర్తించారు. డీఈఓ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాక అప్రూవల్ ఇస్తేనే వర్క్ అడ్జెస్ట్‌మెంటు చేయాలనే యోచనలో ఉన్నారని తెలిసింది. ప్రస్తుతానికి ఒక మండలం నుంచి మరో మండలానికి టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయలేదని డీఈఓ వాసంతి వివరణ ఇచ్చారు.

ఖమ్మం జిల్లాకు గ్రేటర్ పారిశుద్ధ్య సిబ్బంది

వరంగల్ అర్బన్: భారీ వర్షాలతో అతలాకుతలమైన ఖమ్మం జిల్లాలో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు బల్దియా పారిశుద్ధ్య సిబ్బంది మంగళవారం బయలుదేరి వెళ్లారు. మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు సీఎంహెచ్‌ఓ రాజేశ్ సుమారు 150 మంది కార్మికులను ప్రత్యేక బస్సుల్లో పంపించారు. అంతేకాకుండా 10 స్వచ్ఛ ఆటోలు, 5 ట్రాక్టర్లు, ఒక రోబో, ఆహార ప్యాకెట్లను వారి వెంట తీసుకెళ్లారు.

'హత్యాచారాలను అరికట్టడంలో విఫలం'




కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద నిరసన తెలుపుతున్న కేఎంసీ, కేయూ విద్యార్థులు

కేయూ క్యాంపస్: మహిళలు, విద్యార్థినులపై హత్యాచారాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) రాష్ట్ర చైర్మన్ డాక్టర్ దుబ్యాల శ్రీనాథ్ విమర్శించారు. కోల్‌కతాలోని ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ మంగళవారం కేఎంసీ విద్యార్థులు కేయూ మొదటి గేట్ వద్ద నిరసన తెలిపారు. కేయూ విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. అనంతరం శ్రీనాథ్ మాట్లాడుతూ మాట్లాడారు. కోల్‌కతాలో జరిగిన ఘటన అమానుషమైందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పును గౌరవిస్తూ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. కుర్సు అధ్యక్షుడు హుస్సేన్‌నాయక్, పీడీఎస్‌యూ, డీఎస్ఏ, బీఎస్ఎఫ్ నాయకులు బి.నర్సింహారావు, శ్రావణ్‌కుమార్, మత్రి మహేశ్, బొట్ల మనోహర్, కుర్సు బాధ్యులు మాదాసి రమేశ్, జూనియర్ డాక్టర్ లోకేశ్, కశ్యప్, నిఖిల్, దివ్య, అశ్రఫ్, అమిత్, భవ్య, నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



మట్టి గణపతి విగ్రహాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్య శారద, అధికారులు

వరంగల్: నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని వరంగల్ కలెక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి మట్టి విగ్రహాల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. రసాయన విగ్రహాలతో కాలుష్యం ఏర్పడుతుందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రతి జిల్లాకు 2వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసి, పర్యావరణంపై అవగాహన కల్పిస్తోందని తెలిపారు. భక్తులు మట్టి విగ్రహాలను తీసుకెళ్లి పూజించాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లోనే ముంపుబాధితులు

- తగ్గని వరద.. నీళ్లలోనే పలు కాలనీలు
- ఇళ్ల వద్ద పరిస్థితి ఏంటని బెంగ

వరంగల్ అర్బన్ /వరంగల్/ఖిలావరంగల్ : వరంగల్‌లోని పలు కాలనీల ప్రజలు మూడు రోజులుగా పునరావాస కేంద్రాల్లో బతుకుజీవుడా అని కాలం వెళ్లదీస్తున్నారు. మంగళవారం వరుణ దేవుడు కొంత మేరకు శాంతించినా అప్పుడప్పుడు ముసురు పడుతోంది. పల్లపు ప్రాంతాల్లో చెరువుల మత్తళ్ల పరవళ్లు తొక్కడంతో వరంగల్ హంటర్ రోడ్డులోని ఎన్టీఆర్ నగర్, సంతోషిమాత కాలనీ, బృందావన కాలనీలను వరద నీటిని వదలడం లేదు. దీంతో ఆ ప్రాంతాలవారికి ఇంకా పోతన రోడ్డులోని గుజరాతీ భవన్‌లో 150 మంది వరకు ఆశ్రయం కల్పించగా, అందులో 80 మంది వరకు తమ ప్రాంతాల్లో వరద నీటి తగ్గుముఖం పట్టడంతో ఇళ్లకు చేరుకున్నారు.

ముంపుతో బంధువుల ఇళ్లకు...

రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని ఎస్సార్‌నగర్‌లో పలు ఇళ్లు ముంపునకు గురికావడంతో అదే రోజు అందరూ ఇళ్లకు తాళాలు వేసి తమ బంధువుల ఇళ్లకు వెళ్లి తలదాచుకున్నారు. ప్రస్తుతం వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తుండడంతో మంగళవారం సాయంత్రం వరకు ఎవరూ ఇళ్లలోకి రాలేదు. కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల సైతం ముంపునకు గురైంది. రెండు రోజులు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు రాలేదు. విద్యార్థులు వచ్చినా లోపలకు వెళ్లలేని పరిస్థితి.



పోతననగర్‌లోని మార్వాడీ భవన్ పునరావాస కేంద్రంలో ఉన్న ఎన్టీఆర్ కాలనీ వాసులు

కాలనీలు ఇంకా నీటిలోనే..

శివనగర్‌లోని వరద ఉధృతి వీడలేదు. దీంతో 34వ డివిజన్ శివనగర్, 41వ డివిజన్ కాశికుంట,39వ డివిజన్ సాకరాశికుంట,33వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోట ఎస్ఎస్ నగర్, 37వ డివిజన్ శంభునిపేట గిరిప్రసాద్ కాలనీలు స్వల్పంగా నీటిలో ఉన్నాయి. ఆయా కాలనీల ముంపు బాధితులు కొందరు ఉర్సు గుట్ట రోడ్డు కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్నారు. ఆదివారం ఉదయం చేరుకున్న వీరు మూడు రోజులుగా ఇళ్లు ఎమయ్యాయో అంటూ బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

పునరావాస కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదు : వరంగల్ కలెక్టర్ సత్యశారద

పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న నిర్వాసితులు విడిచి వెళ్లకూడదని వరంగల్ కలెక్టర్ సత్య శారద సూచించారు. కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్లు ఇక్బాల్, బండి నాగేశ్వర్‌రావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. నిర్వాసితులను కలిసి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇంటికి వెళ్లే బాధితులకు నిత్యావసర సరుకుల కిట్టు అందజేస్తామని పేర్కొన్నారు.



నీటిలో ఉన్న ఎన్టీఆర్ నగర్



తాళాలు వేసి బంధువుల ఇళ్లకు వెళ్లిన ఎస్సార్‌నగర్ వాసులు

బాక్స్ డ్రైయిన్‌తోనే పరిష్కారం..



ఎస్ఆర్‌నగర్‌లోని వరద నీరుపోయేందుకు బాక్స్ డ్రెయిన్ నిర్మాణమే పరిష్కారం. ఈ కాలనీలోని వరద నీరు పోయేందుకు నిర్మించిన కల్వర్టు, డ్రెయిన్లకు అడ్డంగా ఇళ్లు, భవనాలు నిర్మించడం వల్ల నీరు సాఫీగా పోలేక ఇళ్లు మునుగుతున్నాయి.

– దామెర కృష్ణ, ఎస్ఆర్‌నగర్

పునరావాస కేంద్రంలో వసతులు సరే..



వర్షం వస్తే వసతి కేంద్రాల్లోకి వస్తున్నాం. ఉదయం టీ, టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడుతున్నారు. అది కాదు మాకు కావాల్సింది. మా కాలనీకి వరద నీరు చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

– పద్మ, ఎన్టీఆర్‌నగర్ కాలనీ

ప్రభుత్వం ఆదుకోవాలి..



ఉర్సుగుట్ట డీకేనగర్‌లో నివాసం ఉంటున్నాం. శనివారం రాత్రి,ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షాలతో కాలనీ నీటిలో మునిగింది. కట్టుబట్టలతో బయటపడ్డాం. ఇంట్లోని నిత్యావసర వస్తువులు, బియ్యం బస్తాలు పూర్తిగా తడిసిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలి. – వేముల లక్ష్మీనారాయణ

అథ్లెటిక్స్ ఫైనల్లో జీవంజి దీప్తి


జీవంజి దీప్తి

పర్వతగిరి: పారిస్‌లో జరుగుతున్న పారాలింపిక్స్‌లో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన జీవంజి దీప్తి 400 మీటర్ల అథ్లెటిక్స్ పోటీల్లో టీ20 విభాగంలో ఫైనల్‌కు అర్హత సాధించారు. సోమవారం రాత్రి హీట్–1లో 55–45 సెకన్లలో గమ్యం చేరుకున్నారు. మంగళవారం రాత్రి 10.30గంటలకు జరిగే ఫైనల్‌లో పోటీ పడనున్నారు. కాగా, దీప్తి అథ్లెటిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధిస్తుందని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

హ్యాండ్‌బాల్ భారత జట్టుకు ఎంపికైన పేద విద్యార్థి

- జోర్డాన్ దేశంలో 10వ ఏషియన్ పోటీలకు ఎంపిక
- ఆర్థిక ప్రోత్సాహం అందించని ప్రభుత్వం
- ప్రయాణ ఖర్చులకు అప్పు


హ్యాండ్‌బాల్ భారత జట్టుకు ఎంపికైన తిరుపతి

స్టేషన్‌ఘన్‌పూర్: ఒక వైపు ప్రభుత్వాలు, పాలకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి, క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్ అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూనే మరో వైపు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పేద విద్యార్థులకు కనీస ప్రయాణ ఖర్చులు సైతం అందించడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. కొముురంభీం ఆసిఫాబాద్ జిల్లా కోటాల మండలం ముత్తంపేటకు చెందిన ఆడ తిరుపతి స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల హ్యాండ్ బాల్ అకాడమీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. హాండ్‌బాల్‌లో విశేష ప్రతిభ చూపుతూ రాజస్థాన్ జైపూర్‌లో జరిగిన సెలక్షన్‌లో 10వ ఏషియన్ జూనియర్ మెన్ హ్యాండ్ బాల్ పోటీలకు భారతజట్టుకు తెలంగాణ రాష్ట్రం తరఫున ఎంపికయ్యాడు. అయితే ఈ పోటీలు జోర్డాన్ దేశంలో జరుగనుండగా పేద కుటుంబానికి చెందిన తిరుపతికి అక్కడికి వెళ్లేందుకు ప్రయాణఖర్చులకు డబ్బులు రూ.2.20లక్షలు కావాల్సి ఉంది. వాస్తవానికి సోషల్ వెల్ఫేర్ సొసైటీ, ప్రభుత్వాలు ఈ ఖర్చును భరించడంతో పాటు ప్రతిభ చూపిన విద్యార్థులకు నజరానాలు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం సహకారం అందించకపోవడంతో తీవ్ర బాధపడ్డాడు. తండ్రి కేశవ్ రూ.70వేలు అప్పు తీసుకురాగా, ఘన్‌పూర్ సోషల్ వెల్ఫేర్ హ్యాండ్‌బాల్ అకాడమీ కోచ్ ప్రదీప్‌కుమార్.. తిరుపతి ప్రతిభపై నమ్మకంతో రూ.1లక్ష సహకారం అందించాడు. మిగిలిన మొత్తం ఇతర అధ్యాపకులు, శ్రేయోభిలాషులు సమకూర్చగా తిరుపతి జోర్డాన్ వెళ్లాడు.

వెంటాడిన మృత్యువు..

జనగామ జిల్లా వావిలాలలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ..
- ముగ్గురి దుర్మరణం
- శోకసంద్రంలో మృతుల కుటుంబాలు


లారీ ఢీకొనడంతో ధ్వంసమైన ఆర్టీసీ బస్సు


హేమాని, బుజ్జి దంపతులు (ఫైల్)


నసీమా (ఫైల్)

పాలకుర్తి టౌన్/ పాలకుర్తి : మృత్యువు వెంటాడింది. లారీ రూపంలో కబళించింది. అతివేగంగా వచ్చిన లారీ ఓ ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా కన్నుమూశారు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల గ్రామ శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యాతండా పంచాయతీకి చెందిన హేమాని(55)జాటోతు బుజ్జి(52) దంపతులు నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న తమ కుమారుడు సుమన్, కూతురు అరుణ వద్దకు వెళ్లారు. అనంతరం ఈనెల 2వ తేదీన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మాదాపురం గ్రామ శివారు తండాలోని చెల్లెలు బిక్క ఇంటికి బుజ్జి తన భర్త హేమానితో కలిసి వెళ్లింది. అక్కడ రాత్రి బస చేసిన ఆ దంపతులు.. తిరిగి మంగళవారం తెల్లవారుజామున పాలకుర్తికి వచ్చి తొర్రూరు డిపోనకు చెందిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో తొర్రూరు బయలుదేరారు. ఈ క్రమంలో పాలకుర్తి మండలంలోని వావివాల గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ మలుపు వద్ద ఎదురుగా అతివేగంగా వస్తున్న విశాఖపట్నం నుంచి సిద్దిపేటకు వెళ్తున్న లారీ.. బస్సును ఢీకొంది. దీంతో బస్సులో కిటికీ పక్కన కూర్చున్న హేమాని, బుజ్జి దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో హేమాని అక్కడికక్కడే మృతి చెందాడు. బుజ్జిని 108లో తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. అలాగే, ఇదే బస్సులో ప్రయాణిస్తున్న పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఎం.డి నసీమా(50)తీవ్ర గాయాలపాలై మృతి చెందింది. నసీమా తొర్రూరు మండలంలోని నాంచారి మడూరు శివారు మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ప్రాదిపదికన వంట మనిషిగా పనిచేస్తోంది. నిత్యం పాలకుర్తి నుంచి రాకపోకలు సాగిస్తుంది. రోజు మాదిరిగానే ప్రయాణం చేస్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. నసీమాకు భర్త బడే సాహెబ్, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాద సమయంలో ఆర్టీసీ బస్సులో మొత్తం 18 మంది ప్రయాణికులు ఉన్నారు. ఇందులో ముగ్గురు దుర్మరణం చెందగా నలుగురికి గాయాలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన ఎర్ర సత్యవతి, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందకు చెందిన పోలేపల్లి భూలక్ష్మి, జనగామ జిల్లా పాలకుర్తి మండలం నారబోయనగూడేనికి చెందిన తెరిపల్లి నాగమ్మ, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యతండాకు చెందిన జాటోత్ బాలాజీకి గాయాలయ్యాయి. వారిని పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఘటనా స్థలిని సందర్శించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి..

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి.. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి ఘటనా స్థలిని సందర్శించారు. స్థానికులతో మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఆ సమయంలో వైద్యులు, సిబ్బంది గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు ఫోన్‌చేసి గైర్హాజరైన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కాగా, జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఘటనాస్థలిని పరిశీలించి వివరాలు తెలుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. పార్టీ తరఫున ఆదుకుంటామని భరోసాఇచ్చారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ: పాలకుర్తి మండలం వావిలాల గ్రామంలో లారీ– ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరుతూ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట బాధితులు, సామాజిక సేవకులు సిద్దిపేట ప్రధాన రహదారిపై మంగళవారం ధర్నా చేపట్టారు. కిలో మీటర్ మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగింది. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే అధికారులు బాధితులను పరామర్శించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు డబుల్‌బెడ్ రూం, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐ దామోదర్‌రెడ్డి వారిని సముదాయించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా ఘటనాస్థలికి చేరుకుని బాధితుల సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించినట్లు సామాజిక సేవకుడు ఎండి. యాకూబ్ పాషా తెలిపారు.

టీక్యాతండాలో విషాదఛాయలు..

తొర్రూరు రూరల్: జనగామ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తొర్రూరు మండలంలోని టీక్యాతండాకు చెందిన దంపతులు జాటోతు హేమాని(55), బుజ్జి(52) దుర్మరణం చెందారు. దీంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. హేమాని, బుజ్జి దంపతులు నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడు, కుమార్తె వద్దకు వెళ్లారు. తిరిగి తొర్రూరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులో స్వగ్రామం వస్తున్నారు. మార్గమధ్యలో జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ.. ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో హేమాని, బుజ్జి దంపతులు దుర్మరణం చెందారు. మరో ఇరవై నిమిషాల్లో ఇంటికి చేరుకునే లోపే రోడ్డు ప్రమాదం జరిగి దుర్మరణం చెందారని తెలియడంతో తండావాసులు, బంధువులు..మృతుల ఇంటికి చేరుకున్నారు. మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.


టీక్యా తండాలో మృతుల ఇంటి వద్ద రోదిస్తున్న తండవాసులు

ఈ ఇల్లే వంద మందిని కాపాడింది


ఎస్సై నగేశ్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


వందమందిని కాపాడిన ఇల్లు ఇదే

- మహబూబాబాద్ జిల్లా సీతారాం నాయక్ తండాను ముంచెత్తిన వరద
- ధైర్యసాహసాలు ప్రదర్శించిన సీరోలు ఎస్సై.. అందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలింపు

కురవి/ మరిపెడ: మరిపెడ మండలం సీతారాం తండా పక్కనే ఆకేరు వాగు గలగలపారుతుంటుంది. భారీగా కురుస్తున్న వర్షాలకు వాగులో రోజుకు రోజుకూ నీళ్లు పెరుగుతున్నాయి. ఏటా వచ్చే ఏరే కదా అని తండాలోని జనం మామూలుగా ప్రతీరోజులాగే పనులు ముగించుకుని నిద్రకు ఉపక్రమించారు. యముడిలా ఆకేరు వాగు ఉరిమింది. ఉప్పెనలా తండాపై విరుచుకుపడింది. నిద్రలోనే తండాను ముంచెత్తింది. ఇళ్లల్లోకి వచ్చిన ఆకేరు వరద నీరును చూసి తండా జనం భయంతో పరుగులు తీశారు. ఎటుచూసిన నీరే కనిపించడంతో ఎటుపోవాలో తెలియరాలేదు. ఎత్తుగా ఉన్న తండాలోని మూడ్ నరేందర్ ఇంటిపైకి చేరుకున్నారు. సుమారు వంద మంది తండావాసులు పిల్లాపాపలతో కలిసి నరేందర్ ఇంటిపైకి చేరుకున్నారు. తెల్లవారుజామున ఒంటిగంట నుంచి మొదలైన వరద గంటగంటకూ పెరిగింది. తెల్లవార్లు భవనంపైనే కూర్చున్నారు. నరేందర్ విద్యుత్ శాఖలో పనిచేస్తుండడంతో కురవి మండలం సీరోలు ఎస్సై నగేశ్ సెల్ ఫోన్ నంబర్ ఉంది. వెంటనే ఎస్సైకి ఫోన్ చేయడంతో తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో ఎస్సై నగేశ్ తన సిబ్బందితో తండాకు వేరే మార్గంలో తాళ్లను పట్టుకు ని వచ్చి భవనంపై ఉన్న జనాలను ఒక్కొక్కరిని పొలాల నుంచి ఒడ్డుకు చేర్చాడు. వృద్ధులను జోలెకట్టి ఎస్సై నగేశ్ ఒడ్డుకు చేర్చి బతికించాడు. 'తండాలో 45 కుటుంబాలున్నాయని, ఇప్పటికి మూడు సార్లు వాగు పొంగిందని, ఏటా భయంతో బతుకుతున్నామని, వేరే చోటుకు అందరిని తరలించాలి' అని నరేందర్ వేడుకుంటున్నాడు.


బాధితుడు నరేందర్

ఎస్సైని అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి..

భారీ వర్షం ధాటికి ముంపునకు గురైన సీతారాంతండాకు ఎస్సై నగేశ్ తన సిబ్బందితో చేరుకుని ప్రజలను ఎత్తయిన ప్రదేశంలోకి తరలించడంతోపాటు ఓ వృద్ధురాలిని స్వయంగా ఎత్తుకొని వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఎస్సై నగేశ్ చూపిన ధైర్య సాహసాలకు ఎస్సై నగేశ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి శాలువా కప్పి అభినందించారు.

ఆమరణ దీక్ష భగ్నం

- బీసీ కులగణన చేపట్టాలని దీక్ష చేస్తున్న కుమార్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు


కుమార్ గాడ్గేను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

హన్మకొండ: బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. బీసీ సంఘాల నాయకులు చాపర్తి కుమార్ గాడ్గే, బత్తుల సిద్దేశ్వర్, జక్కాని సంజయ్ గత నెల 25న హైదరాబాద్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా 26న అరెస్ట్ చేసి వారి నివాసాలకు తరలించారు. ఈ క్రమంలో చాపర్తి కుమార్‌ను స్వగ్రామం గీసుకొండకు తరలించగా తన ఇంటిలోనే దీక్ష కొనసాగించారు. కుమార్ ఆరోగ్యం క్షీణించడంలో రెండు రోజుల క్రితం పోలీసులు ఎంజీఎం తరలించారు. మంగళవారం ఎంజీఎం నుంచి డిశ్చార్ అయిన కుమార్ ఏకశిలపార్కు వద్ద 10 రోజు దీక్ష కొనసాగించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో నిర్వహించిన సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిందన్నారు. కులగణన చేపట్టి బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిందన్నారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటినా స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కులగణన, బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు బీఆర్‌ఎస్ నాయకులు పులి రజనీకాంత్, కుసుమ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కూనూరు రంజిత్ గౌడ్, ప్రజాసంఘాల నాయకులు రాజేందర్, క్రాంతికుమార్, జానకీరాములు, శ్రీనివాస్, వనజ, వీరస్వామి, పి.వెంకటాచారి, రవికుమార్, ప్రసాద్, సురేశ్, తదితరులు సంఘీభావం తెలిపారు.

ముగిసిన దర్గా ఉత్సవాలు

- వివిధ ప్రాంతాల నుంచి హాజరై ప్రార్థనలు చేసిన భక్తులు
- ఆకట్టుకున్న ఫకీర్ల విన్యాసాలు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు

కాజీపేట రూరల్: కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా ఉత్సవాలు ముగిశాయి. ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా మత పెద్దలు, భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హజ్రత్ బియాబానీ ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను వేడుకున్నారు. ఉత్సవాలు విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లిం మత పెద్దలు.. ఖుస్రూపాషాను సన్మానించారు. దర్గా ప్రాంగణంలో హైదరాబాద్, గుల్బర్గా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి విచ్చేసిన ఫకీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఇనుమ చువ్వలు, సూదులు నాలుక, శరీర భాగాలపై గుచ్చుకుని అందరిని మంత్రముగ్ధులను చేశారు. అలాగే, ముగింపు ఉత్సవాల్లో ఖవ్వాలీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి భక్తియార్‌బియాబానీ, మన్సూర్‌పాషా,అమర్‌పాషా, మాజీ కార్పొరేటర్ అబు బక్కర్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ : మరో రెండు మూడు రోజులు అల్పపీడనం ప్రభావం ఉండనున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్‌ఈలు, డివిజనల్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని, అధికారులు, సిబ్బంది అప్రమత్తం కావాలన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి ఉద్యోగి వర్షంలో తడుస్తూ అర్ధరాత్రి సైతం లెక్కచేయకుండా నిబద్ధతో అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని అభినందించారు. భారీ వర్షాల కారణంగా ఖమ్మం, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలో చెట్లు విరిగిపడడంతో విద్యుత్ స్తంభాలు విరిగాయని, ట్రాన్స్‌ఫార్మర్లు నీటిలో మునిగాయన్నారు. వీటిని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని సూచించారు. అవసరమైన మెటీరియల్ అందజేస్తామని, సిబ్బందిని కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, సీజీఎం రాజుచౌహాన్, జీఎంలు నాగప్రసాద్, మల్లికార్జున్, అన్నపూర్ణ, శ్రీనివాస్, అంకుష్, డీఈలు అనిల్ కుమార్, శ్రీధరాచారి, రమణారెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వ్యవసాయ శాస్త్రవేత్తలకు అవార్డులు


అవార్డు, ప్రశంస పత్రం అందుకుంటున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు సంధ్యాకిశోర్, ఓం ప్రకాశ్, సీనియర్ అసిస్టెంట్ రమేశ్, మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి

హన్మకొండ: వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అవార్డులు అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్తమ వ్యవసాయ శాస్త్రవేత్తలను ఎంపిక చేసి అవార్డులందించారు. ఇందులో వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి చెందిన అపరాల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సంధ్యాకిశోర్, ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త మండవ వెంకట్రామయ్య ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎంపికయ్యారు. అపరాల పంటలో రూపొందించిన నూతన కంది వంగడాలకు, అపరాల పంటలో సాధించిన పురోగతి, విత్తనోత్పత్తిలో చేసిన మెరుగైన కృషిని గుర్తించి వీరికి అవార్డు అందజేశారు. అదే విధంగా కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. ఓంప్రకాశ్ అవార్డు అందుకున్నారు. వరిలో నూతన వంగడాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడంతో పాటు వరిలో వచ్చే చీడపీడల నిర్మూలనలో ఆధునిక పద్ధతులు రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన శాస్త్రవేత్త ఓంప్రకాశ్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఉత్తమ సీనియర్ అసిస్టెంట్‌గా భూక్యా రమేశ్ ఎంపికయ్యారు. వీరికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి బి.జె.రావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) ఉపకులపతి ఎం. రఘునందన్ రావు అవార్డులు ప్రదానం చేశారు. కాగా, అవార్డులందుకున్న శాస్త్రవేత్తలకు వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి అభినందనలు తెలిపారు.

ఉత్తమ విస్తరణ కేంద్రంగా మల్యాల కేవీకే..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ఉత్తమ విస్తరణ కేంద్రంగా ఎంపికైంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో మల్యాల కృషి విజ్ఞాన కేంద్రానికి ఉత్తమ విస్తరణ సేవ కేంద్రం అవార్డు అందజేశారు. మల్యాల కేవీకే ఆధ్వర్యంలో రైతులకు వివిధ పంటల్లో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందించడం, వరిలో నేరుగా విత్తే పద్ధతిని విస్తృతం చేయడం, తదితర కార్యక్రమాలు చేపట్టారు. తద్వారా మల్యాల కృషి విజ్ఞాన కేంద్రానికి ఈ అవార్డు లభించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి బి.జె.రావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఉపకులపతి ఎం. రఘునందన్ రావు, రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి.. మల్యాల కేవీకే సమన్వయకర్త ఎస్. మాలతికి అవార్డు అందజేశారు.

శరవేగంగా రైల్వేట్రాక్ మరమ్మతు పనులు


కేసముద్రం-ఇంటికన్నె మధ్య దెబ్బతిన్న రైల్వేట్రాక్ వద్ద మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులు


తాళ్లపూసపల్లి- మహబూబాబాద్ మధ్య మరమ్మతుల అనంతరం ట్రయల్ రన్‌గా గూడ్స్ నడుపుతున్న దృశ్యం

- తాళ్లపూసపల్లి–మహబూబాబాద్ మధ్య పనులు పూర్తి
- ట్రయల్ రన్ నిర్వహించిన రైల్వే అధికారులు
- ఇంటికన్నె–కేసముద్రం మధ్య కొనసాగుతున్న పనులు

కేసముద్రం: భారీవర్షం కారణంగా కేసముద్రం– ఇంటికన్నె, తాళ్లపూసపల్లి–మహబూబాబాద్ మధ్యలో రైల్వేట్రాక్ ఆదివారం తెల్లవారుజామున దెబ్బతినడంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ మేరకు రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్, ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం సోమవారం సంఘటన స్థలాలను సందర్శించి, పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జరిగిన ఘటనతో రూ.10కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. 50 మంది అధికారులతో 500 మంది కార్మికులతో రైల్వేట్రాక్‌ల వద్ద మరమ్మతు పనులు మొదలు పెట్టారు. ఇప్పటికే కేసముద్రం రైల్వేస్టేషన్‌లో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రెండు రైళ్లు మూడురోజుల పాటు నిలిచిపోయాయి. తాళ్లపూసపల్లి–మహబూబాబాద్ మధ్యలోని 432, 433 కిలోమీటర్ వద్ద రెండు చోట్ల దెబ్బతిన్న రైల్వేట్రాక్‌పై మట్టి, కంకర పోసి, ఇరువైపులా సిమెంట్ బస్తాలు వేసి మరమ్మతు పనులు పూర్తి చేశారు. దీంతో మంగళవారం సాయంత్రం కేసముద్రం నుంచి తాళ్లపూసపల్లి మీదుగా మహబూబాబాద్ వరకు రైల్వే అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఇంటికన్నె–కేసముద్రం మధ్యలో 418 కిలోమీటర్ వద్ద రైల్వేట్రాక్ అడుగుభాగం సుమారు 200 మీటర్ల మేర పూర్తిగా మట్టి,కంకర, సిమెంట్ దిమ్మెలు కొట్టుకుపోయి గండిపడగా, రైల్వేట్రాక్ వంతెనలా వేలాడుతున్నది. టిప్పర్‌లతో మట్టిని తరలించి యంత్రాల సాయంతో మంగళవారం గండిని పూడ్చారు. ముందు వరదనీటికి అడ్డుగా మట్టిని పోసి, పాత కల్వర్టు ద్వారా వరదనీటిని తరలించారు. వాతావరణం అనుకూలిస్తే బుధవారం సాయంత్రం వరకు పనులు పూర్తి చేయనున్నట్లు రైల్వేఅధికారులు తెలిపారు. కాగా, శనివారం అర్ధరాత్రి నుంచినేటి వరకు రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వర్షంలోనూ ఆగని పనులు

ఇంటికన్నె–కేసముద్రం మధ్యలో పూర్తిస్థాయిలో రైల్వేట్రాక్ దెబ్బతినడంతో శనివారం అర్ధరాత్రి నుంచి కాజీపేట నుంచి విజయవాడ మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో రైల్వే అధికారులు వేగవంతంగా పనులను చేయిస్తున్నారు. రైల్వే థర్డ్ లైన్ కోసం మట్టితో ఫార్మేషన్ పనులు చేయగా, అత్యవసరం మేరకు అదే మట్టిని టిప్పర్‌లలో తరలించి త్వరిగతిన మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ఇప్పటికే ఇసుకబస్తాలను, కంకర తరలించారు. తాళ్లపూసపల్లి–మహబూబాబాద్ మధ్య మరమ్మతు పనులు పూర్తికావడంతో అక్కడ పనిచేసిన కార్మికులను ఇంటికన్నె వద్దకు తరలించారు. ఇదిలా ఉండగా ఒకవైపు వర్షం పడుతున్నప్పటికీ పనులను మాత్రం ఆపకుండా చేస్తున్నారు. ఇక రైల్వేట్రాక్ పైనే టెంట్లు వేసి కార్మికులకు భోజనాలు పెడుతున్నారు. రెండు షిఫ్టులతో కార్మికులు ఉదయం నుంచి రాత్రి వరకు లైట్ల వెలుతురులో పనులు సాగిస్తున్నారు. ఇప్పటికే వంతెన కింద మట్టిపోస్తూ లెవల్ పనులు పూర్తి చేశారు.

నలుగురు చైన్‌స్నాచర్ల అరెస్ట్

- ద్విచక్రవాహనం, గొలుసు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ వరంగల్ నందిరాంనాయక్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

రామన్నపేట : వరంగల్ చౌరస్తా సమీపంలో జూలై 30వ తేదీన ఓ పూజ షాపు యజమాని మెడలో నుంచి చైన్‌ను ఎత్తుకెళ్లిన దొంగలను అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాజీపేట దర్గాలో నివాసముంటున్న సల్మాన్ తన తల్లిదండ్రులు మృతి చెందడంతో చదువు మధ్యలోనే ఆపి గుర్రాలు శుభ్రం చేసే పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో తాళ్ల అవినాశ్ అనే మరో యువకుడిని పరిచయం చేసుకున్నాడు. ఈ ఇద్దరు జల్సాలకు అలవాటు పడి గంజాయి సేవిస్తున్నారు. అయితే జల్సాలకు డబ్బులు సరిపోకపోవడంతో చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా జూలై 30వ తేదీన వరంగల్ చౌరస్తా సమీపంలో రాత్రి 9.30 గంటల సమయంలో పూజాషాపు యజమాని రాజ్యలక్ష్మిని మాటల్లో దింపి ఆమె మెడలో నుంచి గొలుసు లాక్కొని పరారయ్యారు. అనంతరం హైదరాబాద్ వెళ్లి తమ స్నేహితులు అఫ్రోజ్, రఫీకి విషయం చెప్పి గొలుసు విక్రయించాలని కోరారు. అయితే హైదరాబాద్‌లో చైన్ అమ్మడానికి వీలు కాకపోవడంతో మంగళవారం నలుగురు కాజీపేటకు వచ్చి ఫాతిమా బ్రిడ్జి వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల నుంచి చైన్‌తోపాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు.

9 నెలల తర్వాత చిక్కాడు..

- హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ చేరాలు


వినయ్

హసన్‌పర్తి: హత్యాయత్నం కేసులో తొమ్మిది నెలల తర్వాత నిందితుడు పోలీసులకు చిక్కాడు. ఈ ఘటన సంబంధించిన వివరాలను పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు మంగళవారం విలేకరులకు వెల్లడించారు. హసన్‌పర్తికి చెందిన బల్బకూరి వినయ్ అలియాస్ రీచ్ గతేడాది డిసెంబర్‌లో ఇదే ప్రాంతానికి చెందిన జల్లి అక్షయ్‌కుమార్‌ను వైన్‌షాపుకు తీసుకెళ్లి బలవంతంగా మద్యం తాగించే యత్నం చేశాడు. అందుకు అక్షయ్‌కుమార్ నిరాకరించడంతో ఆగ్రహంతో అతడి ముఖంపై బలంగా కొట్టాడు. అంతటితో ఆగకుండా కత్తితో హత్య చేయడానికి యత్నించాడు. అడ్డుకోవడానికి వచ్చిన చికెన్ సెంటర్ యజమాని అమీరుద్దీన్, ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకులు తుమ్మ లక్ష్మణ్, లక్ష్మితో పాటు సురేశ్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు వినయ్‌పై కేసు నమోదు చేశారు. అయితే అప్పటి నుంచి వినయ్ పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో వినయ్ హసన్‌పర్తిలోని తన స్నేహితుడి ఇంట్లో ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సై దేవేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని వినయ్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.